క్లుప్తంగా

ఉండవల్లిలో తాగునీటి పైప్ లైన్ నిర్మాణానికి సన్నాహాలు



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ అధికారులు సోమవారం ఉండవల్లి దళితవాడకు పైపులను తరలించారు. ఉండవల్లి దళితవాడలోని కొండ ప్రాంతం, కొండ క్రింది ప్రాంతంలోను గతంలో పైప్‌లైన్లు రెండు అంగుళాల పైపులైన్లు ఉండడం, ఆ పైపులు తుప్పుపట్టి లీక్‌లు కావడంతో మొత్తం 900 మీటర్ల మేర మూడు అంగుళాల పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. వారం రోజుల్లో కొత్తపైపులైన్లు ఏర్పాటు చేసి పాత పైప్‌లైన్లు తొలగించనున్నామని చెప్పారు.

నోట్ పుస్తకాల పంపిణీ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు అనాథాశ్రమాలకు నోట్ పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. కేఎల్ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని పీజీఎం అనాథ ఆశ్రమం, కాజాలోని కేసీవీలోను నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు డీన్ స్టూడెంట్స్ డాక్టర్ సిహెచ్ హనుమంతరావు తెలిపారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

తైక్వాండోలో మంగళగిరి విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి: తైక్వాండోలో విద్యార్థులు ప్రతిభ చూపారు. తెలంగాణలోని యూసఫ్‌గూడ పరిధిలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఫస్ట్ సౌత్ ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా తరఫున మంగళగిరి నగరానికి చెందిన అభి తైక్వాండో క్లబ్ నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 8 మంది హాజరై రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ చిల్లపల్లి నరేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి టోర్నమెంటులో క్యాడిట్ కేటగిరిలో 9వ తరగతి విద్యార్థి షేక్ ఇస్మాయిల్ సిల్వర్ మెడల్, జూనియర్స్ విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఈ వేదశ్రీ సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు.

నేషనల్ వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాలలోని కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతవారంలో తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో నిర్వహించిన నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో తమ విద్యార్థి గండికోట కృష్ణబాబు సిల్వర్ మెడల్ సాధించాడని, ఫిబ్రవరి నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే ఖేల్ ఇండియా పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా సిల్వర్ మెడల్ సాధించిన గండికోట కృష్ణబాబును డాక్టర్ కె.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, కంభంపాటి క్రాంతికుమార్ అభినందించారు.

సిమెంట్ రోడ్ నిర్మాణానికి ఎర్త్ వర్క్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రెండో గ్రామ సచివాలయం పరిధిలో సిమెంట్ రోడ్ నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభించారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్ నుంచి నీలిమా నర్సరీ మీదుగా రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, ఆ రోడ్డు నిర్మాణానికి ఎర్త్ వర్కులు చేస్తున్నామని కార్పొరేషన్ ఏఈ ప్రవీణ్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- చేనేత భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



పాత మంగళగిరి మసీదు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వైద్య సిబ్బందికి సూచించారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం పక్కనే ఉన్న టిడ్కో నివాసాల ఎస్టీపీ ట్యాంకును పరిశీలించి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. అనంతరం నగరంలోని పాత బస్టాండ్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. నగర పరిధిలోని నవులూరు గోలివారితోటలో గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుని చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి గాంధీ విగ్రహం సెంటర్‌ను అధునాతన విద్యుత్ దీపాలు, పచ్చదనంతో పాటు ప్రహరీ నిర్మించి పూర్తి స్థాయిలో నిర్మించాలని చెప్పారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేదిలేదని ఆర్కే హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా నగర పరిధిలో నూతనంగా తొమ్మిది డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి రోగులకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవనాన్ని సత్వరమే పూర్తి చేసి దుకాణదారులకు కేటాయించి తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య భవన నిర్మాణంలో చేనేత దుకాణాలు ఒకేచోట కేటాయించడంతో చేనేత వ్యాపారులకు వరంగా మారనుందన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

ముస్లిం శ్మశాన వాటికలను పూర్తి చేయాలి

మంగళగిరి: రంజాన్ పండుగ నాటికి నగర పరిధిలో చేపట్టిన ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించారు. నగరంలోని పాత మంగళగిరిలో జరుగుతున్న మసీదు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి నెల ఆఖరిలోగా పూర్తి చేయాలని నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్ అహ్మద్, పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులు లక్ష్యం దిశగా రాణించాలి



విజేతలను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు

మేడికొండూరు: క్రీడాకారుల కృషి, పట్టుదలతో లక్ష్యం దిశగా రాణించాలని ఎన్నారై ఐటీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు అన్నారు. ఇటీవల గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో విశదల అడ్డరోడ్డు వద్ద ఉన్న ఎన్నారై ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బహుమతులు సాధించిన క్రీడాకారులకు అభినందన సభ సోమవారం ఎన్నారై ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడుతూ విద్యతో పాటు, క్రీడల్లో రాణించాలన్నారు. ఇటీవల బీఆర్ స్టేడియంలో పాలిటెక్నికల్ విద్యార్థులు స్పోర్ట్స్ మీట్‌లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించడం గర్వించదగిన విషయమన్నారు. పోటీల్లో ఆర్.రసూల్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ద్వితీయ బహుమతి, డబుల్స్‌లో గొట్టిపాటి రవి కుమార్‌తో కలసి విజయం సాధించినట్లు తెలిపారు. అదే విధంగా షాట్‌పుట్ విభాగంలో రసూల్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ విభాగం ప్రిన్సిపాల్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 28 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మర్రెడ్డి

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల- నరసరావుపేట రోడ్డులోని డోగిప్రరు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సొటైన్ చెన్నై కంపెనీ హెచ్ ఆర్ ఎల్.శోభన ఆధ్వర్యంలో రెండు దశల్లో ఎంపికలు నిర్వహించారు. మొదటి దశలో రాత పరీక్ష, వాటిలోఉత్తీర్ణులైన వారికి రెండో దశలో టెక్నికల్ పరీక్ష నిర్వహించారు. ఈఎంపికల్లో 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ. ఫాదర్ మర్రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాలలో నిర్వహించిన టెక్నికల్ ట్రైనింగ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. హెచ్‌ఆర్ శోభన విద్యార్థులను తమకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని మెరుగైన స్ఫూర్తితో ఉద్యోగం సాధించాలని ఎలాంటి మెలకువలు పాటించాలో డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ ఆర్ శోభన ఉద్యోగాలకు ఎంపికైన 28 మంది అభ్యర్థులను కళాశాల అధ్యాపకులు, విభాగాధిపతులు అభినందించారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి



షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): స్త్రీ విద్య, అభ్యున్నతి కోసం, మహిళల హక్కుల కోసం, తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా కృషి చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. దుగ్గిరాలలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఫాతిమా జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆమె ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుభాని మాట్లాడుతూ బహుజన పిల్లలకు, ముస్లిం ఆడపిల్లలకు చదువుకోమని ఇంటింటికి తిరిగి అడిగేవారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022లో ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన తెలుగు పుస్తకంలో ఆధునిక తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమాకు స్థానం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో షేక్ రషీద్, షేక్ జాని, షేక్ గఫూర్, పఠాన్ ఖాదర్, షేక్ ఖుద్దూస్ పఠాన్ మస్తాన్, బుసులుపాటి యల్లేశ్వరరావు, కాకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించండి



ఫిరంగిపురం: రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ఫిరంగిపురం సెక్టార్ సూపర్‌వైజర్ టి.హేమలత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-2లో సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హేమలత మాట్లాడుతూ రక్తహీనత ఉన్నవారు మునగాకు పొడి, ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు , రక్తహీనత ఉన్నవారిని ఆశ, అంగన్‌వాడీలు గుర్తించి వారికి తగిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారం వంటి వాటిపై వివరించాలని చెప్పారు.

14న గుండురాయి ఎత్తు పోటీలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాల ఆటస్థలంలో ఈనెల 14న గుండురాయి ఎత్తు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని గడిచిన పదేళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 102 కేజీల బరువు గలిగిన గుండురాయిని ఐదు నిమిషాలలో ఎన్ని సార్లు ఎత్తి పడేస్తారో వారు విజేతలుగా ప్రకటిస్తామని తెలిపారు. వివరాలకు బి.చలపతిరావు 9704370926ను సంప్రదించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

తహసీల్దార్ మల్లేశ్వరి



గ్రామ సభలో ప్రసంగిస్తున్న దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): గ్రామాల్లో, పట్టణాల్లో భూ సమస్యలను పరిష్కరించి, వివాదాలు లేకుండా చేయడానికి రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడిలో వైఎస్సార్ జగనన్న భూహక్కు- భూరక్ష పథకంపై న గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో నిర్వహించిన సర్వే రికార్డులనే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఆ రికార్డులను మార్చి ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరించేందుకు అధునాతన యంత్రాలతో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. సమావేశంలో పేరుకలపూడి గ్రామ సర్పంచి గంపల గంగాధర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం బీసీ కాలనీలో రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ పద్మనాభుడికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కాలనీ కనీసవసతులు లేక ఇబ్బంది పడుతున్నామని తాగునీరు వచ్చే వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరిందని దానికి మరమ్మతులు నిర్వహించాలని అర్జీలో కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సోమవారం ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ తెనాలి, దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు కొంగల రవికుమార్, అందె బాల చంద్రమౌళి, నాయకులు వంకదార సుబ్బారావు, డీఎస్ సుదర్శన్ శాస్త్రి పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నదే

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తదితరులు

పెదపరిమి(తాడికొండ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర దశ దిశను మార్చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 నెలల పాటు కొనసాగిన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకు మేలు చేస్తున్నాడన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళుతున్న జగనన్నకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలు వెంటే నడుస్తారనడంలో సందేహం లేదన్నారు. నాటి కష్టానికి ప్రతిఫలమే 151 సీట్లు అన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన..

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి కోరారు. గ్రామంలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. మౌలిక వసతులు నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. స్థానిక లే అవుట్‌లో 8.72 ఎకరాల్లో 287 గృహాలు మంజూరవగా రూ.5.1 కోట్ల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయన్నారు.

జగనన్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



తాడికొండలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్ కుమార్ దంపతులు

తాడికొండ: ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే అని ఉమ్మడి జిల్లాల ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రజలందరి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పాలనతో నేడు పేదలు ఆర్థిక పరిపుష్టితో ఎదుగుతున్నారని చెప్పారు. జగనన్నను రాజకీయంగా ఎదుర్కోలేని బాబు ప్రతిపక్షాలను కలుపుకొని తప్పుడు ప్రచారాలకు శ్రీకారం చుట్టడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.

తెనాలి చిన్నారుల చిరుమువ్వల సవ్వడి

కళా నిలయం జాతీయ నృత్య పోటీల్లో ప్రతిభ



నృత్య గురువు డాక్టర్ బాలకు 'నాట్య విజ్ఞాన్' పురస్కారం

తెనాలి: చిలకలూరుపేటలోని కళా నిలయం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరిగిన 38వ జాతీయస్థాయి నృత్య పోటీల్లో తెనాలి చిన్నారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. పట్టణానికి చెందిన కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, నత్య గురువు డాక్టర్ చల్లా బాలాత్రిపురసుందరి శిష్య బృందం 15 మంది ఈ పోటీల్లో కూచిపూడి, జానపద, శాస్త్రీయ బృంద నాట్యం విభాగాల్లో పోటీ పడ్డారు. వీరిలో భువనేశ్వరి, శ్రీవల్లిక, బాలమహతి, నివేదికత, మౌనికల శాస్త్రీయ బృంద నాట్యం ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో రాజహంస అవార్డును బహూకరించారు. వీరిలో బాలమహతి, శ్రీవల్లికలు స్థానిక మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు. అక్కాచెల్లెళ్లు చలమలశెట్టి మహతి, రిషిత గణపతి స్తుతి అనే కూచిపూడి అంశాన్ని ప్రదర్శించి 'నాట్యమయూరి'ని స్వీకరించారు. చిన్నారుల్ని నాట్యంలో తీర్చిదిద్దిన నృత్య గురువు డాక్టర్ బాలాత్రిపురసుందరిని 'నాట్య విజ్ఞాన్' పురస్కారంతో సత్కరించారు. ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నృత్య గురువు బాలాజీరావు వ్యవహరించారు.

వైఎస్సార్‌కు ఘననివాళి

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా నాయకులు సోమవారం దివంగత నాయకుడు డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.లింగారావు, టి.రామకృష్ణారెడ్డి, సుబ్బారావు, కొండయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఉండవల్లిలో ప్రెజర్ ట్యాంక్‌లు ఏర్పాటు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లికి కృష్ణాజలాలు అందిస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఉండవల్లిలో కార్పొరేషన్ అధికారులు కృష్ణాజలాలు ఇచ్చేందుకు పనులు చేపట్టారు. దానిలో భాగంగా సోమవారం కృష్ణాజలాలను శుద్ధి చేసేందుకు శాండ్ ప్రెజర్ ఫిల్టర్ బెడ్‌లను ఉండవల్లి అమరావతి రోడ్డులో 1.5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. మరో రెండు ట్యాంక్‌లు ఉండవల్లి దళితవాడ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

113 తాళ్లూరులో పొలంబడి



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం క్షేత్ర బృంద సభ్యులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌డీఏ అన్నామణి మాట్లాడుతూ పంటలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించాలని సూచించారు. దానికి ప్రత్యామ్నాయంగా కషాయాలు, ద్రావణాలు వాడటం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో మిర్చి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంసీఆర్పీ వరప్రసాద్, రామకృష్ణ మహేష్, తిరుపతిరావు, ఇర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రాతూరుకు ట్యాంక్ ద్వారా నీటి సరఫరా



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో సోమవారం తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవడంతో కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. నాలుగు రోజుల నుండి ప్రాతూరుకు 24 విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సమయంలో మూడు చోట్ల తాగునీటి పైపులైన్లు పగిలిపోయి తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. సచివాలయ సిబ్బంది కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. మంగళవారం సాయంత్రానికి పైపులైన్ల మరమ్మతులు నిర్వహించి తాగునీటిని పునరుద్ధరిస్తామని ఇంజనీరింగ్ సిబ్బంది తెలిపారు.